క్లుప్తంగా

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: కలెక్టర్ వల్లూరు క్రాంతిని శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు సర్కిల్ బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు కాంత్రి వాలేశెట్టి తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డిటౌన్: పెండింగ్ ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయి భాష రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీసీ కాలేజీ, హాస్టళ్లకు, గురుకుల పాఠశాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో కూల్చివేతలు



పాక్షికంగా కూల్చివేసిన భవనం

పటాన్ చెరు: అమీన్పూర్‌లో అనుమతులు లేని నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశామని తెలిపారు. శుక్రవారం అమీన్పూర్‌లో సర్వే నంబర్ 947లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో నోటీసు ఇచ్చిన స్పందించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని అధికారి పవన్ చెప్పారు. అక్రమ నిర్మాణం ఉపేక్షించమని స్పష్టం చేశారు. అనుమతులు లేని నిర్మాణాన్నింటిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. కొత్తగా విలీనమైన గ్రామాల్లో కూడా టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

నిబంధనలు తప్పనిసరి

పటాన్‌చెరు ఎంవీఐ విజయ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌రావు

పటాన్‌చెరు: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా పాటించాలని పటాన్‌చెరు ఎంవీఐ విజయ్‌రావు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు సీట్ బెల్టు పెట్టుకొని నడపాలన్నారు. మద్యం సేవించి నడపడం, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ వాహనాలను నడిపి ఇతరులకు ఇబ్బందులు, ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం. గురువారం నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి వెయ్యి, ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1500 జరిమానా, 11 మందికి రూ .2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంత.. సమస్యల చింత

ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు

కంది మండల కేంద్రంలో ప్రతీ శనివారం వారాంతపు సంత నిర్వహిస్తారు. సంవత్సరాలుగా కొనసాగుతున్న సంతలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంతను రోడ్డపై నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వర్షం కురిసినప్పుడు విక్రయదారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. మరుగుదొడ్లు, షెడ్లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై సంతను ఏర్పాటు చేసిన వ్యాపారులు

కంది (సంగారెడ్డి): మండల కేంద్రం కందిలో నిర్వహించే వారాంతపు సంత సమస్యల చింతగా మారింది. కనీస వసతులు కరువై సంతకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంతను రోడ్లపై నిర్వహిస్తుండడంతో చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి శనివారం కందిలో జరిగే వారాంతపు సంతకు కందితో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు వస్తుంటారు. సంతలో ఎలాంటి షెడ్లు లేకపోవడంతో వాన కురిస్తే విక్రయదారుల బాధ వర్ణనాతీతం. కూరగాయాలన్నీ తడిసి పాడైపోతున్నాయని వాపోతున్నారు. సంతకు వచ్చే వారికి మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల పరిస్థితి దీనంగా తయారైంది. ఓవైపు చౌరస్తా మరో వైపు బెంగుళూరు బైపాస్ రోడ్డు ఉండడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. సంత నిర్వహణ గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్నప్పటికీ ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని సంతకు వచ్చే వారు ఆరోపిస్తున్నారు. సంతతో వచ్చే ఆదాయంతో మరుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఒకే చోట దుకాణాలు ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతున్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు



అవగాహన కల్పిస్తున్న అధికారిణి రుబీనా

సంగారెడ్డి టౌన్: వరికోతలు కోసిన తర్వాత రైతులు కొయ్యలను కాల్చొద్దని మండలం వ్యవసాయ శాఖ అధికారిణి రుబీనా అన్నారు. వరి కొయ్యలను కాలడంతో వాయు కాలుష్యం, భూమిలోని పంటలకు మేలు చేసే రకరకాల సూక్ష్మ జీవులు చనిపోయి భూసారం తగ్గుతుందని తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పంటలు పూర్తయిన భూములను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ శాతం తగ్గిపోతుందని కావున వరి కొయ్యలను నేలలో కలియ దున్నటం వల్ల సేంద్రియ శాతం, పోషకాలు సూక్ష్మజీవుల లభ్యత పెరిగి భూసారం కాపాడుకోవచ్చని తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన



ఆర్డీఓకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. నియోజకవర్గంలోని కార్మికులు ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ.. గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. జీతాలు లేకుండా కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, నాల్కల్ మొగుడంపల్లి, జహీరాబాద్, ఝరాసంఘం రాయకోడ్, మండలాల నాయకులు కిష్టయ్య, రాజు, రాబర్ట్, రాములు, కమలమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.

ఐఐఐడీ వేడుకల్లో గీతం విద్యార్థులు ప్రతిభ



బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

పటాన్‌చెరు: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియల్ డిజైనర్స్ (ఐఐఐడీ) హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులు ప్రతిభ చాటి పలువురు మన్ననలు పొందారు. ప్రఖ్యాత డిజైనర్ గీత బాలకృష్ణన్ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు నిపుణులు పాల్గొని, హైదరాబాద్‌లోని డిజైన్ కమ్యూనిటీ ఐక్యతను చాటి చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా, అధ్యాపకులు అభిషేక్ కుమార్ సింగ్, స్నిగ్ధారాయ్‌లతో పాటు విద్యార్థులు అనుశ్రీ కలకుంట్ల, భవ్యరెడ్డి, సూర్యకుమారి తదితరులు ప్రాతినిధ్యం వహించారు. ప్రాథమిక దశలోనే అత్యంత ప్రతిభ కనబరిచిన భవ్యరెడ్డి, స్నిగ్ధరాయ్ బృందం, ప్రతిష్టాత్మక తుది పోటీకి చేరుకొని మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. విజేతలుగా ట్రోఫీతో పాటు పది వేల రూపాయల నగదు పురస్కారాన్ని అందుకున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఝరాసంగం(జహీరాబాద్): నేరాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి వెల్లడించారు. మండలంలోని చిల్లపల్లి తండాలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. తెల్లవారు జామున 5 గంటలకు తండాకు చేరుకొని 100 మంది పోలీసులు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణా, సాగు చేయొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కేసులు నమోదైతే ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతారని వివరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, ఎస్ఐలు నరేష్, రాజేందర్ రెడ్డి, ప్రసాద్‌రావు, ఏఎస్ఐ మల్లేశం, గంగయ్య పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యం



ఐశ్వర్య

రామచంద్రాపురం(పటాన్చెరు): ఓ యువతి అదృశ్యమైన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కర్ణాటకకు చెందిన నాగమ్మ కుటుంబం ఆరు నెలల క్రితం తెల్లాపూర్‌లోని ఇందిరానగర్‌కు వలస వచ్చారు. ఆమె కూతురు కూతురు ఐశ్వర్య ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. డిసెంబర్ 29న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో స్వగ్రామంలో, స్నేహితులు, బంధుల వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లింగాపూర్‌లో..

హత్నూర (సంగారెడ్డి): యువతి అదృశ్యమైన సంఘటన హత్నూర మండలం లింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొట్టిముక్కుల బాలమణి అనంతయ్య కూతురు గాయత్రి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి పని చేస్తుంది. గురు వారం డ్యూటీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికి ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గుల పోటీలు

పటాన్‌చెరు టౌన్: బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవాల్లో ముత్యాల ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలో మహిళలు భారీ సంఖ్యలో హాజరై ముగ్గులు వేశారు. చక్కగా ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందజేశారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ నేత నీలం మధు



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు: కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పలు జిల్లాలకు చెందిన మత్స్య సహకార సంఘం చైర్మన్లు, సభ్యులు నీలం మధును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మధు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి త్వరలో తగు నిర్ణయం తీసుకుంటారని ఆశాభవం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భువనగిరి జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా చైర్మన్లు రాజు, పెద్దపల్లి జిల్లా చైర్మన్ నరసయ్య, ములుగు జిల్లా చైర్మన్ రఘు, భువనగిరి జిల్లా చైర్మన్ సంజయ్‌బాబు, కరీంనగర్ జిల్లా చైర్మన్ మల్లేశం, జోగులాంబ జిల్లా చైర్మన్ గోపాల్, జోగులాంబ జిల్లా వైస్ చైర్మన్ మద్దులేటి పాల్గొన్నారు.

వాయు కాలుష్యాన్ని నియంత్రించండి

పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి విజ్ఞప్తి



కాలుష్య నియంత్రణ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మైహోమ్ అంకుర కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో నిత్యం వాయు కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కాలుష్యాన్ని నియంత్రించాలని పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, మైహోమ్ అంకుర కాలనీ అధ్యక్షుడు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మైహోమ్ అంకుర కాలనీకి చెందిన పలువురు శుక్రవారం కాలుష్య నియంత్రణ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీలో దుర్వాసన వస్తోందని దీంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి



ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కారించాలని శుక్రవారం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి కార్పొరేటర్ సింధు వినతిపత్రం అందజేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బొంబాయికాలనీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, మ్యాక్‌సొసైటీ, బీడీఎల్ కాలనీల్లో ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే, ఎల్ఐజీ కాలనీలో కమ్యూనిటీ రోడ్డులో డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే, ఎంఐజీకాలనీలో పారిశుద్ధ్యం సిబ్బంది కేవలం మెయిన్ రోడ్డును మాత్రమే శుభ్రం చేస్తున్నారని కాలనీలోని ప్రతివీధిని శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ సురేష్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి ఉన్నారు.

పథకాలతో ప్రయోజనం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పంచగామ గ్రామానికి చెందిన రమేష్‌కు రూ.23వేలు, ఎన్‌జీ హుక్రానకు చెందిన ఈరయ్యకు రూ.43వేలు, సిద్దంగిర్గాకు చెందిన నాగిరెడ్డికి రూ.12వేలు, నాగూర్(బి)కి చెందిన భాస్కర్‌కు రూ.20వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు పండరి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దిగంబర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అమృత్, కాశీనాథ్‌పటేల్, మనోజ్‌పాటిల్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి అందరికీ ఆదర్శం

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచారన్నారు. మహిళల విద్యకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు.



పటాన్‌చెరు టౌన్: సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు



జహీరాబాద్ టౌన్: రంజోల్ గురుకులంలో..



సంగారెడ్డి రూరల్: నివాళులర్పిస్తున్న ఫోరం నాయకులు



నారాయణఖేడ్ గ్రంథాలయంలో..



హత్నూర పాఠశాలలో..



సంగారెడ్డి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంక్షిప్త వార్తలు

◆ నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా కె.జైపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర తహసీల్దార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు హసీనా, జహీరాబాద్. న్యాల్‌కల్ మండలాల తహసీల్దార్లు హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా రుక్నుద్దీన్, రాంచందర్, ఉపాధ్యక్షుడిగా శ్యాంరావు, బీరప్ప, సహాయ కార్యదర్శులుగా విజయలక్ష్మి, సుచిత్, సురేష్, వలిమొద్దీన్, ఆర్గనైజ్ సెక్రటరీలుగా అశోక్, విఠల్, కోశాధికారిగా సత్యనారాయణ, సలహాదారులుగా సాయన్న, నాగరాణి, స్పోర్ట్ అండ్ కల్చర్ కార్యదర్శులుగా నర్సింహ, లావణ్య, సభ్యులుగా రాణి, అభిషేక్, బెన్నీ, కేవత్,దుర్గ, రవికుమార్, మల్లేశం ఎన్నికయ్యారు.

◆ నేడు విద్యుత్ సరఫరా బంద్

పటాన్‌చెరు: అమీన్పూర్ పట్టణంలో వివిధ కాలనీలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అశోక్‌నగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ మరమ్మతుల నిర్వహిస్తున్నామని తెలిపారు. బీరంగూడ అమీన్పూర్ ప్రాంతాల్లోని కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉ.11:00 గంటల నుంచి సా.05:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. ఆమె మాట్లాడుతూ.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను త్వరలో పరిష్కారిస్తామని తెలిపారు.

◆ బెల్ట్ షాపులు అరికట్టాలి

జహీరాబాద్ టౌన్: గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాలని ఆల్ ఇండియా గిరిజన ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వినయ్‌పవార్, ఎస్పీ సీహెచ్ రూపేష్‌ను కోరారు. శుక్రవారం సంగారెడ్డిలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌పవార్ మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల్లో ఎక్కపడితే అక్కడ బెల్ట్ షాపులు నడుస్తున్నాయని ఆరోపించారు. దీంతో యువత మద్యానికి అలవాటు పడి చెడిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు.

◆ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

రాయికోడ్(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎంఎం. షరీఫ్ అన్నారు. మండలంలోని సింగితం, మామిడిపల్లి గ్రామాల్లో చేపట్టిన సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలన్నారు. దరఖాస్తుదారులు శనివారం గ్రామాల్లో అందుబాటులో ఉండి తమ వివరాలను పంచాయతీ కార్యదర్శులకు వివరించాలని సూచించారు. మండలంలో 10,399 ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు రాగా 8540 దరఖాస్తుల సర్వేను పూర్తి అయిందన్నారు.

◆ నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

కంది(సంగారెడ్డి): పంచాయతీ పరిధిలో నిర్మించే కట్టడాలన్నింటికి అనుమతి తప్పనిసరిగా ఉండాలని డీఎల్పీఓ అనిత పేర్కొన్నారు. కందిలో పంచాయతీ సిబ్బందిపై వచ్చిన ఆరోపణల దృష్ట్యా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గతంలో ఇచ్చిన అనుమతి పత్రాలను పరిశీలించా రు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

◆ రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

జిన్నారం (పటాన్‌చెరు): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హ యాంలో మాజీ సీఎం కేసీఆర్ రైతులకు అనేక పథకాలను అందించారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పంట వేసిన వారికి మాత్రమే రైతు భరోసాను అందజేస్తామనడం బాధాకరమన్నారు.